# పిచ్చి శంకరం

పెళ్ళి చేసుకోకుండా ఉంటే...ఇన్ని కష్టాలు రాకపోను అనుకున్నాడు శంకరం. తాను మొదట్నుంచీ మొత్తుకుంటూనే ఉన్నాడు, ఇప్పట్లో తనకి పెళ్ళి చెయ్యవద్దని. కానీ...అమ్మా, నాన్నా విన్నారా?...నాయనమ్మకి నీపెళ్ళి చూడాలని ఉంది కాబట్టి, చేసుకొని తీరాలి అన్నారు.

సరే...పెళ్ళి నాయనమ్మ చూడ్డంకోసం చేస్తున్నారు, బాగానే ఉంది. చేస్తూ... చేస్తూ... ఆ మేనరికమే చెయ్యాలా?... నాలుగురాళ్లు ఉన్నవాళ్లకో, పదిరాళ్లు కట్నంగా.నయినా ఇచ్చేవాళ్లకో చెయ్యరాదూ! పిల్ల పుట్టకముందే పసుపు - కుంకం పుచ్చుకున్నాం, మాట తప్పడానికి వీల్లేదు అని, గంపెడు పిల్లలతో సతమత మవుతున్న ఆ మేనమామ కూతుర్నే చేశారు.

పెళ్లి చేస్తున్నారు, బాగానే ఉంది. పెళ్లికి అప్పులెందుకూ చెయ్యడం?...ఉన్న దాంట్లోనే చేసేస్తే సరి పోదూ?...అలా వీల్లేదన్నారు. వంటలూ, సదుపాయాలూ బాగుండకపోతే... బంధువులు బ్రతికి ఉన్నంత కాలం దెప్పి పొడుస్తారట! బ్రహ్మాండంగా ఐదు రోజులు వరసగా వివాహ మహోత్సవం జరిపించారు!

పెళ్లి చూడకుండా ఛస్తున్నా...ఛస్తున్నా అన్న నాయనమ్మ దుక్కలాగే ఉంది! కానీ, నాలుగు కాలాలు బతికి నలుగురి అప్పులూ తీర్చి, నలుగుర్ని పోషిస్తాడు అన్న తండ్రి హఠాత్తుగా తనువు చాలించాడు. పరిస్థితులు విషమించాయి. శంకరం బియ్యే పూర్తి చేయకుండానే... ఉద్యోగాన్వేషణలో మునిగిపోయాడు.

ఇంతకీ, పెళ్ళివల్ల జరిగిన నష్టాలు ఏమిటంటే—ముఖ్యంగా అప్పులు. అటుపైన-- మరి ముగ్గుర్ని పోషించాల్సిరావడం ... శంకరం, శంకరం తల్లీ, నాయనమ్మా కాకుండా, భార్యా, ఇద్దరుపిల్లలు ఎక్స్ట్రా అయ్యారు. పిల్లలతోవచ్చిన చిక్కేమంటే, వాళ్ళకి ఘడియఘడియకూ డాక్టర్లు కావాలి! మందులు కావాలి!! వీళ్ళతో సమానమయిన మనిషి...నాయనమ్మ! ఈవిడ చావనూ చావదు! బతకనూ బతకదు! ఇదీ తన కథ!!

పోనీ, ఉద్యోగం అన్నా ఉంటే ఎలాగో అలాగ సంసారాన్ని ఈడ్చెయ్యవచ్చు. కానీ, అదీ లేదు.

భారంగా మెట్లు ఎక్కి లోపలకు వెళ్లాడు. గంటల తరబడి అతనికోసరం కూచున్నాడు—

ఆయన తాపీగా వచ్చాడు. నిదానంగా అడిగాడు-"ఎంతవరకూ చదువుకున్నావ్?" అని.

"బియ్యేవరకూ..." అంటూ సమాధానం యిచ్చాడు శంకరం. గుండె బిక్కు... బిక్కు మంటోంది. వెయ్యిమంది దేవుళ్లకు మొక్కుకున్నాడు ఖాళీలు లేవు అనకుండా చూడమని.

"బియ్యే ప్యాసయ్యావా?"—అదోలా చూశాడతను.

"లేదండీ!...కానీ, హిందీ, ఇంగ్లీషు, బెంగాలీ...మూడు భాషలూ బాగా వచ్చునండి!"—బ్రతిమాలుకున్నట్టుగా అన్నాడు శంకరం.

**పిళ్లా సుబ్బారావుశాస్త్రి**

అతను చలించాడు.

"ఎన్ని భాషలు వచ్చినా, ఎన్ని డిగ్రీలున్నా...ఈ రోజుల్లో ఉద్యోగా లెక్కడివయ్యా?"... ఇంతకి ... నువ్వెలాటి ఉద్యోగం చెయ్యగలవు?" అని అడిగాడతను.

"ఏ ఉద్యోగం అయినా చేస్తానండీ...!" అన్నాడు శంకరం.

"సరే — ఖాళీలు ఉన్నప్పుడు చూస్తాన్లే...!"

"అలా అనకండి! ...పిల్లలుగల వాణ్ని..." అన్నాడు శంకరం దీనంగా, నిరాశగా!

"అరె...! అప్పుడే నీకు పిల్లలా?" అని, ఆశ్చర్యంగా అడిగాడతను.

"జౌనండీ..." అన్నాడు సిగ్గుతో కుంగిపోయి శంకరం.

"ఎంత మందేమిటి?"

"ఇద్దరే లెండి...!" అన్నాడు శంకరం.

"ఏమయినా, నువ్వు నన్ను వదిలేలా లేవు!"అంటూ, సిగరెట్టు ముట్టించాడతను.

"ఏదో బియ్యేవరకూ చదివినవాణ్ని!... పిల్లలు గలవాణ్ని! ఏదో ఒక ఉద్యోగం యిప్పిస్తే...మీ మేలుమర్చిపోను!"అన్నాడు శంకరం.

"అది నిజమేనయ్యా, అసలు ఉద్యోగం అంటూ ఖాళీఉంటే అలాగే చేద్దును— కాని, ప్రస్తుతం నీకోసం ఓ ఉద్యోగం కల్పించాలి,...అంతేనా..."

"శ్రమ అనుకోకుండా..." ఆశగా చూశాడు శంకరం.

"ఇంతకీ నీకెంత జీతం కావాలి?..."అడిగాడతను.

"నేనడిగినంత జీతం మీ రిస్తారా?... అది మీరే నిర్ణయించాలి" అన్నాడు, రవ్వంత ఆనందంతో.

"అహ...అదికాదు నీఉద్దేశ్యం ఏమిటో తెలుసుకుందాం అనీ—అయినా చెప్పడానికేముందీ? చెప్పు—" అన్నాడాయన.

"ఏముందండీ! నేనూ, నావాళ్లూ రెండు పూటలా యింతగంజి అయినా తాగాలంటే వందాయాభై రూపాయలయినా ఉండాలండీ...! గత్యంతరం లేదు కాబట్టి— ముప్ఫయి రూపాయలు యిస్తే న్నా ఉద్యోగం చెయ్యడానికి సిద్ధంగా ఉన్నా!" అన్నాడు శంకరం, అమాయకంగా.

"ఐతే, నీకు ముప్ఫయి రూపాయలమీద ఉద్యోగం వేయిస్తాను" అన్నాడతను శంకరం కళ్ళల్లోకి చూస్తూ.

"ముప్ఫయ్యా? ..." ముఖం మాడిపోయింది. దీనంగా చూశాడు శంకరం!

"ఒక్క ముప్ఫయి కాదు! మూడు ముప్ఫయిలు... తొంభై రూపాయలమీద ఉద్యోగం వేయిస్తాను..." అన్నాడతను. శంకరం ముఖం గంపంత అయింది.

"ఐతే, ఒక్క విషయం" అన్నాడతను ఏమిటన్నట్టుగా చూశాడు శంకరం.

"రహస్యం..." అన్నాడు అతను.

"చెప్పండి..." అన్నాడు శంకరం.

"ఐతే, విను-నీకు బెంగాలీ, ఇంగ్లీషు బాగా వచ్చునన్నావు కగూ..."

"హిందీ కూడా వచ్చునండీ" అన్నాడు శంకరం.

"ఏం లేదు. నేను కొన్ని బెంగాలీ పుస్తకాలూ, ఇంగ్లీషు పుస్తకాలూ యిస్తాను. వాటిని జాగ్రత్తగా అనువాదం చెయ్యాలి" అన్నాడతను.

"తెలుగులోకా?"

"జౌను-ఒక్క విషయం. ఆ అనువాదం పుస్తకాలన్నింటికీ...నా పేరే ఉంటుంది."

"మీ పేరా అండీ?" అని అడిగాడు కొద్ది ఆశ్చర్యంగానే.

"జౌను, నా పేరుకానీ, మరొకరి పేరుకానీ...అవన్నీ నీకు అనవసరం. నీకు ఇచ్చిన బెంగాలీ, ఇంగ్లీషు పుస్తకాలన్నీ అనువాదంచేసి యివ్వడం వరకే నీ పని. ఆ

(43-వ పేజీ చూడండి)

# ★ పిచ్చి శంకరం ★

(34-వ పేజీ తరువాయి)

తర్వాత ఆ పుస్తకాలతో నీ కేటువంటి సంబంధమూ లేదు. తెలిసిందా? అన్నాడతను సీరియస్‌గానే!

శంకరం క్షణం నిరుత్తరంగా నుంచొని, 'సరే నండీ!' అన్నాడు.

"ముఖ్యమయిన విషయం-ఈ రహస్యం ఎవరికీ తెలీనివ్వకు."

"సరే నండీ."

"నీ పేరు?"

"శంకరం."

"ఇదో-శంకరం! నీకు చాలాగట్టిగా చెబుతున్నాను. ఈ అనువాదాలు నువ్వు చేస్తున్నట్టుగా-నీకూ, నాకూ తప్పితే మరెవ్వరికీ తెలీనివ్వకు. అలా తెలిసినందువల్ల నా కేమాత్రం నష్టం లేదు. నీకే" అన్నాడాయన అధికార స్వరంలో.

"నే నెవరికీ చెప్పనండీ," అన్నాడు శంకరం.

"ఊ-నిన్నెవరయినా, ఏం ఉద్యోగం చేస్తున్నావని అడిగితే, నా దగ్గర సెక్రటరీనని చెప్పు. తెలిసిందా" అన్నాడతను.

తర్వాత-"ఇదో, ఈ పదిహేను రూపాయలూ తీసుకువెళ్ళు...పాలడబ్బా అంటున్నావుగా," అంటూ మూడు ఐదు కాయితాలు అందించాడతను. అంత ముఖం చేసుకొని, మెట్లుదిగాడు శంకరం.

అతనొక ప్రచురణకర్త. తెలుగు నవలలూ, కథలూ అవీ ప్రచురిస్తూ ఉంటాడు. వ్యాపారం కిటుకులూ అవీ తెలిసిన గడుసరి. పట్టలేని సంతోషంతో సిగరెట్టు ముట్టించాడతను.

* * *

కొద్దిరోజుల్లోనే ఎన్నో బెంగాలీ, ఇంగ్లీషు అనువాదాలు బయటకు వచ్చాయి. ఆ అనువాదాలు ఎంతో బాగున్నాయి. కానీ, అవి శంకరంఅనువాదాలని ఎవరికీ తెలీదు. అంతా ప్రచురణకర్తనే మెచ్చుకున్నారు. అందరూ అతని అనువాదమే అనుకుంటున్నారు.

మరికొన్ని అనువాదాలు 'అతని' కూతురు పేర వెలువడ్డాయి. బాగా అమ్ముడు పోయాయి. శంకరం ఒక విధంగా రవ్వంత బాధపడ్డాడు. తానూ ఒకప్పుడు రచయితే. తననీ అందరూ మెచ్చుకుంటారని అనుకున్నవాడే. కానీ-అతనికి బానిసఅయ్యాడు. ఐతే, తన పెళ్ళాం పిల్లలూ కొంతవరకూ సుఖపడుతున్నారని సంతోషించేవాడు శంకరం.

* * *

కొద్ది రోజుల తర్వాత-శంకరం ఆరోగ్యం చెడిపోయింది! పదిరోజుల్నించీ మంచం మీదనే ఉన్నాడు.

అతనే శంకరం యింటికి వచ్చేడు.

"ఇంకా నీ జబ్బు నయంకాలేదా?" అని అడిగాడు.

"లేదండీ!" అన్నాడు శంకరం.

"ఇంకా ఎన్నాళ్ళయ్యా...ఈ రోగం?" అని అడిగాడతను.

"మరోవారం మంచంమీద ఉండాలని డాక్టర్ అన్నాడండీ!" అన్నాడు శంకరం.

"ఎలాగయ్యా!...జీతం మాత్రం కరెక్టుగా పుచ్చేసుకుంటావు. ఈ నెల సగం జీతమే యిస్తాను. మీలాంటి వాళ్ళకి ఉద్యోగాలే యివ్వకూడదు" అంటూ, కూకలేశాడు అతను.

శంకరంకి మండిపోయింది—

"ఏమిటండీ......మీరు వెలగబెడుతున్నారు?...మీకు వందలకు వందలూ లాభాలు వస్తూంటే, తొంభై రూపాయలే కదా...యిస్తున్నారు. మీకు వచ్చిన వందలూ ... నాకు మీరిచ్చిన తొంభైలూ లెఖ్ఖ పెట్టండి...వెయ్యోవంతయినా ఉందా? మీకు ఒక్క రూపాయలేకాదు. పేరుకూడా వస్తోంది! పైగా, రోగంతో ఛస్తుంటే ... సగంజీతం యిస్తారా?" అని నూటిగా అడిగాడు శంకరం.

"అదికాదు—"

"ఏదికాదండీ!...ఉన్నపళంగా అసలు విషయం బయటపెడితే......మీగతేమవుతుంది?..."—కోపం పట్టలేక పోయాడు శంకరం.

"శంకరం! శాంతించవయ్యా...! ఏమిటాకోపం?...పదిరోజులు అయింది కదా, ఇంకా జ్వరం తగ్గలేదా...అని డాక్టర్‌మీద వెయ్యాల్సిన కేకలు నీమీద వేశాను. అంతే—అమ్మా! కొంచెం జాగ్రత్తగా చూసుకో...! ఇదో, ఈనెల జీతం మీ ఆయన పట్టి దుడుకుమనిషి... నే వెళ్ళి మా ఇంటిడాక్టర్‌ని పంపిస్తాను. ఎంబీ ... బియ్యేనూ; మంచివాడు. బిల్లుకూడా తర్వాత తాపీగా చేస్తాడు. అతన్ని పంపిస్తాను. వస్తానమ్మా!" అంటూ, ఎంతో అభిమానంగా, ఎంతో తియ్యగా చెప్పి, తొంభై రూపాయలూ ఇచ్చి బయటకు వచ్చాడు అతను.

వీడు ఎలాఅయినా పీకలమీద కత్తే అనుకున్నాడు.—జీతాలిచ్చి, అనువాదాలు చేయిస్తాడని కొందరు అనుకుంటూనే ఉన్నారు. "ఈ విషయం 'శంకరమే' బయటపెట్టి ఉండాలి!" అనుకున్నాడు అతను. కానీ, శంకరం ఆ విషయం యింతవరకూ ఎవ్వరితోనూ అననేలేదు.

అతను ఏదో ఎత్తువేశాడు. నిశ్చింతగా వచ్చేశాడు.

అతను పంపిన డాక్టర్ వచ్చి, శంకరానికి ఇంజక్షన్ ఒకటి యిచ్చి... "పర్వాలేదమ్మా! తగ్గిపోతుంది!" అని, ఓ విషపు నవ్వు నవ్వేడు.

కొద్దిరోజులు మంచంమీదనే ఉన్నాడు శంకరం.

శంకరం పిచ్చివాడు! అతనికేమీ తెలీదు. బుర్ర పూర్తిగా చెడిపోయింది! చాలా తక్కువ కాలంలోనే... వీధి ఎక్కిపోయేడు!

పెళ్లాం, పిల్లలూ ... అందర్నీ మరిచిపోయాడు! గతం ఏమాత్రం గుర్తులేదు...

అతను ఉన్నాడు; శంకరం ఉన్నాడు. శంకరం అనువాదాలూ ఉన్నాయి. కానీ అవి శంకరం అనువాదాలని ఎవరికీ తెలీదు. శంకరం పిచ్చివాడవడానికి కారణం 'అతనే' అని ఎవరికీ తెలీదు. అతనిపేర ఉన్న అనువాదాలు 'పిచ్చిశంకరం'వి అంటే...ఎవరూ నమ్మరు! సరికదా... నవ్వుతారు. ★

రవి టాయ్‌లెట్స్ అందమునకు, వర్చస్సుకు

రవి గ్లిసరిన్ సోప్:—అన్ని కాలముల్లో, ముఖ్యంగా వేసవికాలములో వాడదగినది. శరీరమును మృదువుగను, కాంతిగను ఉంచును.

రవి వెజిటబుల్ హేరాయిల్:- శిరోజములను విస్తారంగా పెంపొందించును. దానిచక్కని సున్నితమైన సువాసన అందరికి ఆనందము కలుగచేయును.

రవి స్నో:-ముఖవర్చస్సును కాపాడి, విలాసమును పెంపొందించును. సోల్ ఏజెంట్లు:-

ది న్యూస్టార్ & కంపెని, 10, వైద్యశాఖ మొదలివీధి, తండియార్పేట, మద్రాసు-21.